పిరికివాడు

"నువ్వు నిజంగా దేవకన్యవు" అన్నాడు వెంకటేశ్వర్లు. అనసూయకు వొళ్ళు మొగ్గలు తొడిగింది. రెండేళ్ళబట్టీ ఆమె మొగుడుతో కాపరంచేస్తున్నా, ఒక్కనాడు గూడా ఆ భ్రష్టుడు అనసూయ సౌందర్యాన్ని మెచ్చుకొన్న పాపాన బోలేదు. నిజానికి ఈదేశంలో చాలామంది భర్తలకు తమ భార్యల గొప్పదనం తెలీదు; ఎదటివాళ్ళుచూసి, పైకి మెచ్చుకొని, లోపల్లోపల వాడి అదృష్టానికి అసూయపడి, నీతివంతంగా నవ్వేందాకా.

తనకు వొంటినిండా సొమ్ములుదిగేసి, సిల్కుగుడ్డలుకప్పి, రుచికరమైన తిండిమేపి, కళ్ళుమూసుకొని కామతృష్ణ తీర్చుకొనే భర్తకంటే, గొప్పగా, విలువగా అనసూయకు కనిపించాడు వెంకటేశ్వర్లు. ఆమెకు తనవొళ్ళు చూచుకోవాలనిపించింది అద్దంలో; తను ఎంత అందంగావుంది! భర్త కోరకపోయినా, తనకుతానై చూపించినప్పటికీ, కనుక్కోలేని అందం ఈ వెంకటేశ్వర్లుకి ఎట్లా కనిపించిందా అని అనసూయకు ఆశ్చర్యంవేసింది.

"నిజం,అమ్మతోడు. నిన్నుచూస్తుంటే గుండెలు పొంగుతున్నయ్. ఎంత అందమయింది నీ వొంటిరంగు-చిక్కని పచ్చకాంతితో చెదురుతోవుండే నీచెక్కిళ్ళు—ఏమిటి వాటివిలువ? ఈ లోకంలోవుండే మొగవాళ్ళు ఏమిస్తారు వాటిని చూసినందుకు? తెలీదు నీగొప్ప నీకు—"అన్నాడు ఆయాసపడుతో. ఆగిపోయినాడు అక్కడ, పైన మాట్లాడలేక.

అనసూయకు తనస్థితి కొద్దికొద్దిగా తెలుస్తోంది అప్పుడే! తను యింతకాలం చలి, వేడి, గాలి, వెలుతురు, చీకటి లేని విచిత్రమైన లోకంలోవుంటే, వెంకటేశ్వర్లనే మహావ్యక్తివచ్చి, తన నీచత్వాన్ని కళ్ళకుగట్టినట్టు విప్పిచెప్పి, తెరిపికి లాక్కొచ్చి నట్లుగా అనిపించిందామెకు.

వెంకటేశ్వర్లు చెప్పిందాకా తనలో అంతగొప్ప అందం వున్నదన్నసంగతి అనసూయకు తెలీదు. అరుదుగా తప్పితే లోకంలో ఎవరి విలువలు వారు సరిగ్గా నిర్ణయించుకో లేరు. అందులో స్త్రీలు మరీ. ఎప్పుడో, ఎక్కడో, తళుక్కుమని మెరుపుకుమల్లే. రసనకోసం కలలుగనే తారుణ్యాహృదయులు వొచ్చి, ఆమె సొగసును. సొబగును, గొప్పను, ఆమె పురుషుల్లో, లోపలలోపల రగిలించే కోరికలను, ఆమె తన సంచిక్కితే, ఎట్లా ఏయేపద్ధతులుగా ట్రీట్ చేయదలచుకొనేదీ ధైర్యంగా విప్పిచెప్పిందాకా, స్త్రీలు తనప్రభావాన్ని తాము తెలుసుకో లేరు. తలిదండ్రులు ఆమాత్రం జ్ఞానం. కలిగించరు కూతుళ్ళకు. భర్తయినాసరే! తనభార్యను మెచ్చుకొని, ఆమె అందాన్ని పొగిడి, తనకు ఆమెవల్లవొస్తున్న ఆనందానికి కృతజ్ఞత చెప్ప టానికిగూడా భర్తలు భయపడతారు. అట్లా అనటంవలన పెళ్ళాలకు గర్వంపుట్టి, మాటవినరని వాళ్ళభయం. తను సంపాదించినతిండి తిని, తనఆజ్ఞల్ని నెరవేరుస్తూ. తన కుళ్ళునంతా భరించి, గాడిదకుమల్లే వుండవలసిన భార్యను మెచ్చుకోవటం తప్పనుకొంటారు—మరి ఏఆధారంవల్లనో తెలీదు చాలామంది పురుషులు.

అయినా కొందరు భర్తలకు పెళ్ళాం అందగా వుండటం బావుండదు. దాని అందాన్నిచూసి మోహిస్తారేమో ఇతరులు, అనేభయం వాళ్ళకు. ఎవ్వరూ మెచ్చుకోని, ఎవ్వర్నీ కదిలించని, సిబ్బెలాంటిభార్యతో గృహస్థధర్మం సంతోషంగా నాగిస్తాయగానీ, సౌందర్య దీధితులతో లోకాన్ని మోహింపచేయగలవాళ్ళను వొప్పవు. భయం లోపల; ఈ"నిధి" తమనుంచి దొరకక పారిపోతుందని. తమ శక్తిమీద అంత విశ్వాసం ఈ పురుషులకు!

ఇంతకాలం భర్తతో కాపరంచేసింది, అతనికి వండి పెట్టింది, అతని యింటిని దొంగలనుండి, జంతువులనుండి, దుర్మార్గులనుండి కాపాడింది. అతనికి యిష్టమైనట్టుగా, అతనికి ఏమాత్రం నొప్పితగలకుండా తననుతను మార్చుకొంది. ఆయన తృప్తికోసం ఫలానా చీరె కట్టుకోనుంటే, తనకు అదేమీ బాగుండకపోయినా, ఆచీరె కట్టుకొని, బాగుండలేదన్న భావం తనలో ఎక్కడా కనిపించకుండా అణిచివేసి, తన అంతరాత్మ ఘోషపెడుతున్నా అదిఅబద్ధమని,ఆచీరెబాగున్నట్టుగానే నటించింది. తనకు సొమ్ములు తగిలించి, నలుగురికీ గొప్పగా తనను చూపిస్తే వూరుకొంది. వాళ్ళంతా కనిపించే చీరెలు, ఇంటో అందరూ నిద్రలుపోయినతరువాత, పడకగదిలో కట్టుకొనమంటే కట్టుకొంది. రోగమొచ్చి ఘోరంగా మూల్గుతుంటే పడింది.

ఈ రెండుసంవత్సరాల కాలంలోనూ తనభర్త తననెప్పుడూ అభినందించలేదు. ఇంతచేసినా వెంకటేశ్వర్లు అన్నట్లు యింత అందమయిన వొంటిని వాడికి యిస్తే—ఆఖరికి వొక్క—

రన్నా తనను మెచ్చుకొన్నాడా? వెంకటేశ్వర్లు మెచ్చుకొన్న కళ్ళనైనా చివరికి తనుమాత్రం అనుకుందా తనలో యింతశక్తి వుందని? వెంకటేశ్వర్లు చెప్పిందాకా తనకా సంగతి తెలీదు.

అనసూయ అద్దంముందునించొని ఒకసారి తనఛాయను చూచుకొంది. వెంకటేశ్వర్లు అన్నవాటిల్లో వొక్కటీఅబద్ధం అనిపించలేదు. ఇదివరకు అనేకసార్లు అద్దంలో చూచుకొంది తను. మొగుడు తననుగురించి వర్ణిస్తూ తిట్టేవక్రతలే అద్దంలో కనిపించేవి అప్పుడు. ఇప్పుడు వెంకటేశ్వర్లు మోహించిన నవ నవలు కనిపించినై. తనమీదతనకే అనంతమైనప్రేమవొచ్చింది. ఇంతటి వుదాత్త సౌందర్యఖండం ముందు, అతను—తనభర్త, నిలుచుంటానికే అనర్హుడనిపించింది. తను యింతకాలం మోస గించబడింది. ఇంకానా?

వెంకటేశ్వర్లు ఆమెభర్త వుండనిసమయం చూచుకుని వొచ్చి, ఆమెను పొగుడుతూ కూచుంటాడు. ప్రారంభంలో అతనికది కొత్తగానే వుంది. రానురాను అతనిమనస్సు ఆమెను స్తుతించడంతోనే తృప్తిపడటల్లేదు. ఆమెను తనదానినిగా చేసు కోవాలనిపిస్తోంది. నిజానికి అమూల్య పదార్థాన్ని ఎవడు కోర కుండా వుంటాడు? స్వపరభేదాలు తరువాతసంగతి.

ఇంతకాలంనుండీ అజ్ఞాతంలోపడిపోయిన ఆమెమనస్సును వెంకటేశ్వర్లు లేపి రగిలించాడు. ఆమెనుగురించి ఆమెకు నిజం చెప్పాడు, అనుకోనివిధంగా వెలుతురు రావటంవల్ల చీకట్లో వున్న ఆమెకు బెదురుకలిగింది. తననుచూసి మెచ్చుకొంటున్న వ్యక్తికి ఎవడు సానుభూతిచూపించడు? అనసూయ మనస్సులో సహజంగా వెంకటేశ్వర్లుమీద ప్రేమకలిగింది. ఈ సమయంలో

వెంకటేశ్వర్లు తీసుకుంటున్న చనువుకు ఆమె అడ్డంచెప్పలేకపో యింది ఎంతప్రయత్నించీ గూడా.

వెంకటేశ్వర్లుతో పరిచయం అయినప్పటినుండీ, ఆమెకు తనసంగతి అర్ధమవుతో దికొంచెంకొంచెం. ఇంతకాలా ఆమెకు తనభర్త మన్మధుడుమల్లే, బృహస్పతికిమల్లే కనిపించాడు. కని పించినా కనిపించక పోయినా కనిపించినట్టుగానే మెలగింది. తప్పదు ఆమెకు. ఆడది లోకంలోవున్న ఉన్నతిత్వానంతా మెచ్చుకోక, అదంతా విలువలేని చెత్తగాచూసి, మాట్లాడి, తననేపొగడి, తనలోలేని గొప్పలను సహితం వున్నట్లు ఆమె మాట్లాడుతుంటే, ఆ అబద్ధాలకు అలవాటుపడిన పురుషఆత్మలు సహిస్తాయా, భార్య తనను ఆరాధించనట్లు కనిపిస్తే? అందుకే గావును—స్త్రీకి తనభర్తకంటే వున్నతమూర్తులు, విజ్ఞానధ నులు, సౌందర్యవంతులు కనిపించినప్పటికీ బిగ్గరగా మెచ్చుకొనే హృదయం లేకుండాచేసింది సమాజవిధానం.

ఇప్పుడు వెంకటేశ్వర్లువొచ్చి తన మనోనేత్రాలనువిప్పిన తరువాత "సత్యం" చూడగలిగింది ఆమె. తను ఎంతకాలం నీచంగా గుడ్డిగా గానుగెద్దుకుమల్లే బతికిందో తెలిసింది. తనభర్త కంటే నిజంగాచాలాగొప్ప వెంకటేశ్వర్లు. తనకు సాధారణంగా వుండేశరీరం అతనికి అపురూపంగా అగపడుతోంది. తనభర్తను ఏపరిస్థితిలోనూ మెచ్చుకొనేట్టు చెయ్యలేని తను, వెంకటేశ్వ ర్లును పూరికేకదిలించి, వెర్రివాణ్ని చేసింది. భర్తచేత అసహ్యాం పబడుతో, గౌరవంగా ఆతని నీచపు చూపులకింద బతికేకంటే, ఆ వెంకటేశ్వర్లుతో లేచిపోతే! అతనికిగూడా బ్రహ్మచర్యం పొదల్లేదు.

అనసూయ అట్లా మనసులోనే అనుకుంటోంది. వెంక టేశ్వర్లుతో పోతే భవిష్యత్తు యెట్లా వుంటుందోనని. మొగ వాడుగనక ముందుగా బైటబడ్డాడు అతను. తెగించి అడిగాడు వోకనాడు.

"అమ్మో" అనిఅదిరిపడింది ఆమె. ఇంతకాలం తను స్వగతంగా, ఇంతకుంటే అతనినుండి ఘాటైన మాటలు వినిన ప్పటికీ, వాస్తవంగా అతను పలికేటప్పటికి బెదిరిపోయింది ఆమాటల అదృశ్యశక్తికి.

"రావా?" అన్నాడు వెంకటేశ్వర్లు.

"నేను—నేనా వొచ్చేది?" అన్నది పైకి. లోపల హృదయాంతరాళ్లో అతనట్లా అనటం సంతోషం ఆమెకి.

"నువ్వు, అవును నువ్వే - నువ్వే! రావా! ఎందుకింత నిర్దయ నామీంద? ఏమిటి నేను చేసిన అపరాధం? ఎందుకు యీశిక్ష నాకు? ఈకాంతిని, యీకళ్ళను, యీవొంటిని తాకే అదృష్టం నాకులేదా? ఆ గాడిదకేనా యీ కనకాంతుల మెత్తదనం! వాడు చేసినపుణ్యం ఏమిటి? ఎందుకు నన్నిట్లా ఘోరంగా వధిస్తావు, నీచూపుల లాలినుచూపి, అందపు వెల్లు వనుచూపి? చెప్పు—చెప్పు—రావా?"

ఎందరుప్రియులు అట్లా స్త్రీలముందు మోకరిల్లి, ఆమె కడకంటి చూపుకోసం, పలచని నవ్వుకోసం, దయాపూరితమైన వొక్క-మాటకోసం, అంగీకారం తెలిపే శిరఃకంపనంకోసం ప్రాధేయపడ్డారో ఎన్నివందలు, ఎన్ని వేలు, ఎన్నిలక్షలమంది! అట్లా తమహృదయాలను పరిచారో స్త్రీముందు? నెత్తురులు కురిపించి, యుద్ధాలుచేసి, రాజ్యభ్రష్టులై, లోకాన్ని అసహ్యించు

కొని. శుష్క వేదాంతాన్ని, మననంచేసుకుంటో, కృత్రిమ సంతృప్తిని పొందుతున్నారో ఆమె దయాలేశాన్ని పొందలేక!

"ఇవన్నీ వొదిలి?" అన్నది.

"వొదిలి"

"సీతో...?"

"రావా? చెప్పు. చచ్చిపోతాను ఇక్కడే. ఇప్పుడే, నీపాదాలముందు గుండెలు బద్దలయ్యేట్టు ఘోషించి చస్తాను. తలబద్దలుకొట్టుకొని చస్తాను. ఎందుకు యిక్కడ నువ్వు? నీసౌందర్యానికి తగినఆరాధనలేని యీదౌర్భాగ్యపుచోటులో? ఇదే! ఈ నికృష్టమే, నీకు సంతోషమిస్తోందా? ఎవరు నిన్ను స్తుతించేందుకు యిక్కడ...?"

అతనిమాటలు, ఆమెను కరిగించినట్లు ఎట్లా తెలిసిందో అతనికి? వెళ్ళి కావిలించుకొన్నాడు. ఎవరన్నాచూస్తారేమో, చూస్తే ఎంతప్రమాదమో అనేసంగతులు జ్ఞప్తికిరాలేదు అతనికి. మోహమనేదే అంత అసలు—

"తలుపు"

"వొద్దు. ముందునేనుచస్తాను. తరవాతనువ్వు......" మిగతామాట పూర్తిచెయ్యలేకపొయ్యాడు. అక్షరాలు గొంతులోనే ఆగిపోయినాయి. పూర్తిచెయ్యటానికి, అతనికి భయం—తన ప్రేమరాసి మరణాన్ని, ఎవరుమాత్రం వూహించగలరు కవీసం?

త నింతకాలంనుండీ, దూరంనించి తలుచుకొని, కలలు గన్నవ్యక్తి చేతికి లభించేసరికి, అతని మనసులోని ప్రేమంతా, వొక్కసారి కట్టలు తెంచుకొని, పైకుబికింది.

"ఎవరునువ్వు?" అన్నాడు ఆమె అంతరాంతరాల్లో చూస్తో. పలకలేదు ఆమె—పలకలేక.

"చెప్పు! ఎవరునువ్వు"

"అనసూ..."

"ఛీ. కాదు. ఎవరు?"

"రాఘవయ్య కూతుర్ని"

"థూ" ఫూశాడు.

"సీతాపతి భార్య..."

"వాడు. ఆ పంది పేరు, యీ ముద్దు పెదాలమీద పలకనియ్యకు. నాకు మహామంట వాడంటే. రేపు వాణ్ణి తంతాను డొక్కపగిలేట్లు. పురుగు వాడు."

ఎంత స్వార్థం వెంకటేశ్వర్లుకు: అసలు 'ప్రేమ' అన్నేదే స్వార్థపూరితం. కాకపోతే ఎందుకు ఎందరో మహత్యాగాలు చేసి ఆనందపడతారు దేశంకోసం—వొక్క పిసరైనా త్యాగం చెయ్యనివాళ్ళుగూడా చివరకి.

"నువ్వు దేవతవి. కిన్నెరుల గాంధర్వురుతానివి. పసిరిక బయళ్ళమీద బారులు బారులుగా ప్రసరించే వెన్నెలకాంతి నీడవు. ఎడారిలోపడి, యిసికకు సైతం చలనంపుట్టించే తొలి నక్షత్రపు లేతకిరణానివి. నువ్వు అనసూయవు కావు. ఇంద్రధనుస్సువు. వెలుతురు వానవు..."

అట్లా అంటో ఆమె చెక్కిళ్ళను, కళ్ళను, మెడను, మృదువుగా తాకుతో మైమరచిపొయ్యాడు వెంకటేశ్వర్లు...

* * * *

అనసూయభర్త లేనప్పుడల్లా వెంకటేశ్వర్లు వొస్తుంటాడు వాళ్ళయింటికి. ఆమెకు కొత్తరుచుల్ని చూపి, కొత్తదనం నేర్పి, ఎన్నడూ, ఎప్పుడూ, భర్తనుండి తెలియని నూతనరీతులుగా ఆమెను ట్రీట్ చేస్తున్నాడు అతను. కనుబొమ్మలమీద వెంట్రుకలకుమల్లే, ఎముగుబొదుగులు లేని ఆమె భర్తతోడి సాంసారికజీవితానికి, వెంకటేశ్వర్లు చేస్తున్న రకరకాల ఎక్స్పెర్మెంట్లు. రీతులు, ఆమెకు భ్రమనుకలిగించి, వూహించని సుఖాల్ని యిస్తున్నాయి. ఆమెకు లోలోపల అతనిమీద ఆరాధన కలుగుతోంది—

కొద్దిరోజులు గడిచేటప్పటికి యిద్దరికీ కాలం భారమయింది. విడిచివుండలేకపోతున్నారు వొకరినొకరు. ప్రతిక్షణం జీవితంలోని వొకభాగం అనుభవించకుండాపోతున్నామే! ఎందుకు యీదుర్భర నిబంధనలు? అనియిద్దరూ అనుకొన్నారు.

కానీ సంఘం వొప్పుకోదు. దంపతులు వొకరియందు వొకరికి జాజ్వల్యమానంగా వెలుగుతున్న ప్రేమలు నశించిపోయి, బొమ్మలకుమల్లే, మనస్సు వేరొకచోటనిలిపి, ఆవ్యక్తే యీవ్యక్తిఅని ఆత్మవంచన చేసుకొని, అంతర్గతంలో వొకరినొకరు భయంకరంగా అసహ్యించుకొంటూ, పైకిమూత వేసిన మురుగుగుంటలకుమల్లే కనిపిస్తూవుంటే చాలా సంతోషిస్తారు. ఇష్టమైన వ్యక్తితో, సుఖంగా వుంటే కులానికి, మతానికి, వర్గానికి అతీతంగా వొప్పుకోరు. వీళ్ళుయెప్పుడు, కూటికిమాడి గుడ్డకుమాడి, ఎక్కాడా తలదాచుకోటానికి చోటుదొరకక, నరకబాధపడతారా అని కనిపెట్టుకొని గుటకలు మింగుతారు.

అసూయ వీళ్ళకు 'అట్లాంటి'వాళ్ళమీద—పురుగులకుమల్లే లుకలుకమంటో జీవించక విశాలంగా బతుకుతున్నారేఅని.

ఒకానొక మహత్తర పునీత నిశివేళ అనసూయను తీసుకొని బండెక్కి చాలాదూరం వొచ్చేశాడు వెంకటేశ్వర్లు. అతనివెంట తెచ్చుకొన్న డబ్బు రెండు మూడు నెలలకంటే ఎక్కువకాలంరాలేదు. తరవాత అనసూయ తనవొంటిమీది నగలు త్యాగంచేసింది ప్రియుడికి; ప్రాణాలను సైతం ప్రియులకోసం గడ్డిపరకలకుమల్లే త్యజింపచేయగల మోహానికి యిదొక లెఖ్ఖలోది గాదు.

పాడతారు. ఒకరిగొంతు వొకరికి అద్భుతంగా వినిపిస్తుంది. వొకరిస్పర్శ మరొకరికి రత్నకాంతుల మృదుత్వంవలె వుద్రేకపరుస్తుంది. ఒకరికెదురు వొకరు కూచొని, వెలుతురుగా కరిగిపోతున్న ఆకాశంకేసి చూస్తో, తెరచాపలకుమల్లే దూదికొండలకుమల్లే తేలుతున్నమబ్బులను గమనిస్తో, యిదినిజమా స్వప్నమా, అని అనుమానించి రుజువుకోసం వొకరినొకరు తాకి చూసుకొంటో. అలిసిపోయి, మెలికలుపడి, విడవలేక, నవ్వుకొని, పరుగులెత్తి, కలల్లోకిమల్లే జీవించారు వాస్తవికలోకంలో నిజంగానే...

* * * *

కొంతకాలంనుండీ వెంకటేశ్వర్లుమనస్సు సరిగ్గా వుండటల్లేదు. కారణాన్ని బైటకు ఏ రూపంలోనూ కనిపించకుండా వుంచేదానికి అతను గట్టిగా ప్రయత్నిస్తానే వున్నాడు. అయినా అది దాగటల్లేదు. అనసూయకు తెలిసింది అతనిలో మార్పు

వొచ్చిందని. అతని చేతలను చూస్తే ఆమెకు తెలిసేది అతని మార్పు.

"చెప్పవా?" అనేది అనసూయ.

"ఏమిటి" అంటాడు అతను.

"దిగులు. నీలోమార్పు. ఎందుకు దాచుకొంటావు లోపల? నాతోగూడా భయమా? నమ్మకం లేదా నామీద?"

"ఏం లేదు"

"వొట్టిది."

"నిజం—అబ్బే" నవ్వాలని ప్రయత్నం చేశాడు—వెనకటి మోస్తరు. కాని మనసులో నిర్మలత్వంలేనిది బయటికి ఎట్లా వొస్తుంది?

"కాదు. నాకు తెలుసు. ఏమిటీనాతప్పు? ఎవరేమన్నారు నిన్ను? నాతో చెప్పవా? దాచుకొంటావా?" అన్నది. కళ్ళల్లోకి చెమ్మవొచ్చింది.

"ఛీ! ఏమీలేదు" అన్నాడు. ఆమె తడిసిన కళ్ళను ముద్దుపెట్టుకొంటో.

ఆమెకు చప్పున తెలిసింది అది ఆత్మలోనుంచి వొచ్చింది గాదని. నిర్మలమైన మోహాన్ని, అతనినుండి అనుభవించిన ఆమెకు, అతని ముద్దులో, నవ్వులో వెనుకటి పుదాత్తత కనిపించటల్లేదు.

అనసూయ ఎంతబతిమాలినా వెంకటేశ్వర్లు నిజం చెప్పడు. ఎప్పుడూ మొఖంవంచుకొని, దిగులుగా, ఆలోచిస్తూ వుంటాడు. నిద్రపోతున్నప్పుడు ఆమెదగ్గిరికొచ్చి తీక్షణంగా ముఖంలోకి చూస్తాడు; ఏదో రహస్యాన్ని బేధించనున్న వాడి

మోస్తరు. ఆమె ప్రతి కదలికలోనూ, ఏవో అర్థాలు తీసుకొంటుంటాడు తప్పుడుగా.

ఇదివరకు అనసూయను నిమిషంసేపు విశ్రాంతిగా వుండనిచ్చేవాడుగాదు. ఇప్పుడు ఆమెను అంతగా చూడటల్లేదు. తింటాడు. పిచ్చిగా, వ్యర్థగా వొకమూల కూచుంటాడు. తనకుతానై అనేకసార్లు ఆమె అతన్ని వుద్రేకపరచాలని చూసింది. ఆఖరికి చక్కిలిగిలిపెట్టి నవ్వించి, అప్పుడు అతని దిగులును గురించి అడిగి, దానితరుణోపాయం ఆలోచిద్దామని చూసింది.

అతను విసుక్కుని "నన్ను కదిలించబోకు అనసూయా! చిరాగ్గావుంది మనసు" అన్నాడు మొఖం చిట్లించుకొని. ఆమె ఎంతో నటించి, ప్రయత్నించింది. అది అగమ్యగోచరం ఆమెకు.

అతని మనసులోపల మాటిమాటికీ రామారావు బొమ్మే కనిపిస్తుంది. రామారావు కొత్తగా వాళ్ళుంటున్న యింటి పక్కకు వొచ్చాడు ఆఫీసరుగా. ఎర్రగా పొడుగ్గా వుంటాడు. తుమ్మెద రెక్కల్లాంటిమీసాలు సగానికి కత్తిరిస్తాడు. వొత్తుగా వుంగరాలు తిరిగిన జుట్టు మొఖంమీద పడుతోవుంటుంది రామారావుకు. అందమైన బంగారపు కళ్ళజోడు, బూట్లు, పంచెలోనించి డ్రాయరు కనబడుతోవుండి, సిగరెట్ కాలుస్తో వుంటాడు ఎప్పుడూ. అతనంటే వెంకటేశ్వర్లుకు కోపం. అతను మాటిమాటికీ అనసూయవైపుకు చూస్తాడు, పెళ్ళయినా యింకా బ్రహ్మచర్యాన్ని పాలిస్తున్నాడుగనక. వీళ్ళవసారాలో వుండిచూస్తే పిట్టగోడమీదుగా రామారావుహాలు కనిపిస్తుంది

అట్లాగే తనతో మాత్రం అనకుండా వుంటుందని ఏమిటి నమ్మకం?

ఇంతకాలంనుండి గతించిన విషయాలను అడగనివాడు, వొకవేళ అనసూయ నవ్వుతూ ఆ ప్రసక్తిని తెస్తే మండిపడే వాడు, వొకరాత్రి అనసూయను అడిగాడు, ఆమెకు సంతోషంగా వున్నట్లు కనిపిస్తూ వెంకటేశ్వర్లు.

తనతో మనసిచ్చి మాట్లాడనివాడు, యిప్పుడు తనకు తానే ఎందుకు యిట్లామారాడా? అని అనసూయ ఆలోచించ లేకపోయింది. తన ప్రియుడు తనతో మాట్లాడిందే పదివేలను కొంది.

"నువ్వు నన్ను ప్రేమిస్తున్నావా?"

అనసూయ మనసు సగుచ్చచ్చింది ఆ మాటకు. ఎందుకు తన నిట్లా అడిగాడు? ఎందుకు సందేహం కలిగింది తనమీద? ఇంకా ఏవో మాటలనుకుంది ఆమె; తననుగురించి యీవిధంగా అతను దిగులు పడుతున్నాడని తెలీక.

"ఆ. ఎందుకు ఆ సందేహం నామీద నీకు?"

"నువ్వు—వాడు—ఆ భర్తనుగూడా ప్రేమించావా?"

"ఇప్పుడు ప్రేమ లేదు."

"ఇప్పుడు—సరే—అప్పుడు—నువ్వు భర్తతో కాపరం చేసేటప్పుడు?"

"ఆఁహ"

"ప్రేమ లేనట్లుగావుంటే అతను సహించాడా? ఏమీ అడ్డ లేదా?"

"ప్రేమిస్తున్నట్టుగానే వుండేదాన్ని ఇష్టంలేకపోయినా."

అతనికి అనుమానం లేదా నీమీద?"

"ఆఁ పోనిద్దురూ. ఆ పాడుసంగతులు యిప్పుడెందుకు."

"అహా. కాదు. చెప్పు? అనుమానం కలగలేదా?— కలిగింది కదూ? అవునా? ఏమిటి? లేదా?"

"ఛీ. పోనివ్వండి."

"ఇదిగో! ఇంతేనా నామీద ప్రేమ? పోనీలే, చెప్పవా'" అన్నాడు మళ్ళీ గడ్డంబట్టుకొని మెల్లిగా వూయించి, ఆస్పర్శకు ఆమె హృదయం మెత్తబడిపోయింది.

"మనసులో ఏముండేదో నాకు తెలీదు. కాని అతనికి అనుమానం కలగనట్టుగా వుండేదాన్ని."

"నటన. కదూ?"

"గావును"

"నన్ను ప్రేమిస్తున్నావుగదా?"

"ఏమిటి ఆ సందేహం నీకు?"

"వుండు. అతనితో వుంటుండగానే నన్ను ప్రేమించావు గదా?"

"ఆ. నీమొదటి చూపులోనే నీమీద ఆరాధన కలిగింది నాకు."

"ఎందుకు అతనికంటేఎక్కువ ఏంచూసి నాలో?"

"ఏమిటి యిట్లా మారిపొయ్యారు? ఈపరీక్ష లేమిటి?"

"చెప్పు, ఏం చూసి?"

"గొప్ప"

"ఏమిటి ఆ గొప్ప?"

"చాతకాదు చెప్పడం. పువ్వునుండి వాసనను విడదీయ లేనట్లు నీలోనించి ఆ విలువలు విడదీసి చెప్పలేను. నువ్వు నిలువునా గొప్పవాడివి."

"అందం, చదువు, తత్వం..."

"కొంతవరకు"

"మాటవరసకి — నాకంటే గొప్పవాడు కనిపిస్తే— మాటవరసకిలే, అతన్ని ప్రేమిస్తావుగదా?"

"ఛా! మిమ్మల్ని విడిచా?"

"ఎందుకు అవగూడదు? నీభర్తకంటే వున్నతుడనని అతన్నివిడిచి నాతో వొచ్చావు. నాకంటే వున్నతుడు..."

"ఆపండి. ఆమాటకు నాగుండెలు పగిలిపోతై. నేను చస్తాను అప్పుడూ వొదిలేది నిన్ను" అన్నది అతని భుజం మీద తలపెట్టి. కోపంగా, దూరానికి తోశాడు వెంకటేశ్వర్లు.

"చెప్పు. పోతావుగదూ?"

"పోను. మిమ్మల్ని విడవను. నిజం" అన్నది ఏడుస్తూ.

"ఎందుకని?"

ఏంచెబుతుంది అనసూయ?

"నాకంటే మంచివాడు దొరికినప్పుడు?"

"మిమ్మల్ని ప్రేమించాను"

"నీభర్తనుగూడా అంతేగదా?"

"లేదు. నిజం. నమ్మండి"

"ప్రేమించనట్లు కనిపిస్తే, అసహ్యాన్ని కనబరిస్తే, అతను చావదన్నక, విడిచిపెట్టాడా?"

"ప్రేమించినట్లు వుండేదాన్ని"

"ఇప్పుడు నాతోగూడా అంతేనా?"

"ఛీ. మీతోనా?"

"ఎట్లా నమ్మకం నాకు?"

ఆమె ఏ ఆధారాలు చూపి, యిది నటనకాదని రుజువు చేసుకోగలుగుతుంది? రోజూ, నీచమైన పురుషులముందు, నడకలో, మాటలో, చూపులో, అనుమానింపబడి, హింసింపబడుతో, దాని ఘోరబాధనుండి తప్పించుకోలేక, చేసేదితోచక, సహాయంకోసరం, నిశ్శబ్దంగా దేవతలను ప్రార్థించి, గుండెలు పగిలిపోయేట్టు ఘోషించే, లక్షలాది భారతస్త్రీల సాంప్రదాయం, ప్రియుడుతో లేచివొచ్చినా అనసూయకు తప్పలేదు.

"చెప్పు. ఎట్లా నమ్మకం?"

"నాగుండెలు కోసి చూడండి. మీరూపం తప్ప యింకోటి..."

"కవిత్వం చెప్పబోకు. గుండెలు కోస్తే చస్తావు. ఏం లాభం? నీభర్తను ప్రేమించావుగదా...?"

"ఆ". అన్నది యిక దిక్కులేక.

"అయితే నాతో ఎందుకొచ్చావు?"

"మోహించి"

"అదే—అట్లాగే యింకొకణ్ణి—నాకంటె మంచివాణ్ని మోహించవా?"

"లేదు"

"మంచివాణ్ని చూసి? నాకంటె చాలామంచి?"

"అహ"

"అయితే అప్పుడు—కాపరం చేసేటప్పుడు నన్నెందుకు మోహించావు?"

"నేనుకాదు. నువ్వే నన్ను మోహించి, ఆకర్షించి, తెచ్చుకున్నావు" అన్నది తనుచేసిన దాంటో తప్పువుంటే అది కాస్తా వెంకటేశ్వర్లు మీదికి తోశాననుకుని.

కానీ వెంకటేశ్వర్లు వొదల్లేదు.

"సరే! నువ్వుకాదు. ఇంకొకడు నిన్ను నాకంటే తీక్షణంగా మోహించి ఆకర్షించితే వెడతావు, అవునా?"

"పోను"

"పోనిదానివి, అప్పుడు నాతో ఎట్లావొచ్చావు?"

ఆఖరికి విసుగుపుట్టి, అనసూయ అక్కడనుండి లేచివెళ్ళింది. వెంకటేశ్వర్లు ఆమె వెంటబడి పైటబట్టుకు లాగుతో, "చెప్పు. పోతావుగదా?" అనటం మానలేదు. ఆమెసమాధానం చెప్పలేక ఏడుస్తూ మూలపడుకుంది. వెంకటేశ్వర్లు, లోగడ తను పొగడిన శరీరాన్ని, తన చేతులమధ్య, తన వొంటికింద, పెదిమలకింద, నవనవలుపొందిన ఆమెవొళ్ళును, చితకనొక్కాడు. తన్నాడు. ముద్దులతో పులకరెత్తించిన ముఖంమీద కాండ్రించి వూశాడు. జుట్టు పీకాడు. తల నేలకేసికొట్టాడు చివరికి, హింసించే వోపికలేక అలిసి, రొప్పుతో పోయి పడుకొన్నాడు.

అనసూయ ఏడ్చింది. నీతులతో, ఆచారాలతో, ధర్మశాస్త్రాలతో, దైవభక్తితో, పాతివ్రత్యంతో, జీవత్వంపోయి, కాంతితగ్గి, బిగిసి, కరుడుగట్టిపోయిన, భారత పురుషులకు; ఆత్మలను వక్రించుకొని, నిర్జీవబ్రతుకులను బ్రతుకుతున్న భారత పతివ్రతా తిలకాలకు, ఈ సున్నితప్రాణి భయంకరశోకం వినిపిం

చలేదు. లేచివొచ్చిన దానిని పరామర్శించపోతే, తమ నిర్మలత్వం ధ్వంసమయిపోతుందేమో నని, పాపంచుట్టుకొని నరకానికి పోవలసివొస్తుందేమోనని భయపడి, ఎవ్వరూ పక్కలు దిగక, కదలక, నవ్వుకొని నిద్రపోయినారు.

వెంకటేశ్వర్లు వొంట్లోనుండి వేడిగాలుపులు పొంగి నెత్తికెక్కెటికి. అతనికి 'కిన్నెరుల గాంధర్వ రుతం—యిసికకు సైతం, చలనంపుట్టించే వెన్నెలనీడ'' అనసూయలో కనిపించలేదు. తుచ్ఛురాలు, కులట, పతిత, మోసగత్తె కనిపించింది. భర్తను విడచి, వొకప్రియుడితో లేచివచ్చిన మనిషి, అతన్నివొదిలి యింకొకడితో పోదనీ, పతివ్రతగా వుంటుందనీ ఏమిటినమ్మకం? వుండేదయితే పెనిమిటిని వొదిలి తనతో ఎందుకు వొస్తుంది? ఆ రావటానికి గల కారణాలే యిక్కడ—తనదగ్గర మాత్రం ఎందుకు పనిచెయ్యవు? ఇది కొద్దిరోజులలో తనకంటే మంచివాడితో లేచిపోగలదు ఆ రామారావు వెధవతో. తనే దానికింత కాళ్ళు తెచ్చాడు. 'లేపుకు' రాకుండా రహస్యంగా వ్యవహారం జరుపుకొంటున్నట్లయితే బాగుండేది. అప్పుడు తనను గాదని మరొకడితో సంబంధం పెట్టుకొన్నా తనింత కష్టపడేవాడు గాదేమో! ఎందుకంటే అనసూయ తనభార్య గాదు. ఇక్కడ భార్య గాకపోయినా, ప్రియురాలు. అయినా... ఇది వేరు సంగతి...

అనసూయ ఏడ్చి, ఏడ్చి, వోపికలేక, అలిసి, నిద్రపోయింది. వుదయం లేచేసరికి వెంకటేశ్వర్లు పక్క కాళీగావుంది. అంతే! ఆతరువాత గూడా అతను, అనసూయ కెప్పుడూ కనిపించలేదు.